ఈసురోమని రోడ్లు ఉంటే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటింది. ఆ పార్టీల నేతల గొప్పలకు అంతే లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సబ్బవరం మండలంలోని రోడ్లు దారుణంగా ఛిద్రమయ్యాయి. రోడ్డేదో.. గొయ్యేదో కూడా చెప్పుకోలేని పరిస్థితి. వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నా.. కనీసం గోతుల్ని పూడ్చేందుకూడా ప్రభుత్వం, అధికార యంత్రాంగం ముందుకురాని దుస్థితి.



గొల్లలపాలెం సమీపంలోని అమృతపురం రోడ్డులో రాకపోకలకు అవస్థలు



పెట్రో, మారిటైం విశ్వవిద్యాలయాలకు వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి

- అధ్వాన రోడ్లతో అవస్థలు
- తాజా వర్షాలకు ఛిద్రం
- హెవీ వెహికల్స్ రాకపోకలతో భారీ గోతులు
- కనీసం గుంతల్ని పూడ్చాలని స్థానికుల మొర

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. కొన్ని రోడ్లలో నడిచేందుక్కూడా ఇబ్బందే. ఈ సీజన్లో కురిసిన వర్షాలకు ఈ రోడ్లు మరింత దయనీయంగా మారాయి. శిథిలావస్థకు చేరుకున్న రోడ్ల మీదుగా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు లోనవడంతో పాటు, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను పునరుద్ధరించకపోయినా.. కనీసం గుంతలనైనా పూడ్చాలని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు.



అధ్వానంగా ఉన్న రాయపురఅగ్రహారం రోడ్డు

- గొల్లలపాలెం సమీపంలో సబ్బవరం జోడుగుళ్ల నుంచి అమృతపురం జాతీయ రహదారి వైపు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్బవరం నుంచి నరవ మీదుగా విశాఖ వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో ఈ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది.
- చోడవరం రోడ్డులోని ఆరిపాక నుంచి రాయపుర అగ్రహారం మీదుగా విశ్వవిద్యాలయాలకు వెళ్లే రోడ్డులో చాలా చోట్ల గోతులు ఏర్పడి, అధ్వానంగా తయారయ్యింది. పెట్రో, మారిటైం యూనివర్సిటీలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. ప్రస్తుతం యూనివర్సిటీల్లో భవన నిర్మాణాలు వేగవంతం కావడంతో నిర్మాణ సామగ్రి తీసుకొచ్చే భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. ఈ గోతుల్లో చాలాసార్లు వాహనాలు చిక్కుకుని, బయటకు రాలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- అంతకాపల్లి, రావలమ్మపాలెం మీదుగా గుల్లేపల్లి వెళ్లే బీటీ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. చినుకు పడితే రోడ్డేదో.. గోతులేవో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- కోటపాడు రోడ్డులోని గుల్లేపల్లి నుంచి పినగాడి వెళ్లే మధ్యలో మల్లునాయుడుపాలెం వద్ద రోడ్డు అధ్వానంగా తయారయింది. కోటపాడు నుంచి విశాఖ వెళ్లే ప్రధాన రోడ్డు ఇదే కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు భారీ గోతులతో వాహన చోదకులకు నరకాన్ని చూపిస్తున్నాయి.

మరమ్మతులైనా చేపట్టాలి



సబ్బవరంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సబ్బవరం నుంచి నరవ మీదుగా విశాఖ వెళ్లే రోడ్డు గొల్లలపాలెం సమీపంలో అడుగడుగునా గోతులతో దర్శనమిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతలలో నీరు చేరడంతో తరచూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే ప్రయాణం సాఫీగా సాగుతుంది. కనీసం తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రమాదాల్ని నియంత్రించాలి.

– సింగంపల్లి వెంకటరావు, జోడుగుళ్ల జంక్షన్

భారీ వాహనాలతో గుంతలు



మండలంలోని సబ్బవరం నుంచి అసకపల్లి మీదుగా లంకెలపాలెం వెళ్లే రోడ్డులో చాలా చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై పరవాడ ఎన్టీపీసీతో పాటు పలు పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో వర్షం కురిస్తే చాలు రోడ్లు ఛిద్రమవుతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రోడ్డుపై ఆటోలో వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. వెంటనే ఈ రోడ్డును పునర్నిర్మించాలి.

– అల్లు మౌళి, కళాకారుల కాలనీ

రోడ్లు అభివృద్ధి చేయాలి



తాజా వర్షాలకు మండలంలోని రోడ్లన్నీ పాడయ్యాయి. చాలా చోట్ల మట్టి రోడ్డే నయమనే పరిస్థితి ఉంది. చినుకు పడితే చిత్తడే. రోజూ రోడ్లపై వెళ్లే అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవట్లేదు. అడపాదడపా స్థానికులే గోతుల్ని మట్టితో పూడ్చుకోవాల్సి వస్తోంది. రోడ్లను అభివృద్ధి చేస్తే ప్రయాణ వేగం పెరుగుతుంది. సమయం, ఇంధనం ఆదా అవుతాయి. ప్రమాదాలు తగ్గుతాయి. అధికారులు దృష్టిసారించాలి.

– ఎం.గౌరేష్, సాయినగర్ కాలనీ

నేటి నుంచి నేషనల్ మీడియేషన్ పోటీలు

సబ్బవరం: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో తొలిసారిగా డీవీ సుబ్బారావు నేషనల్ మీడియేషన్ కాంపిటిషన్‌ను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో 20, 21, 22 తేదీల్లో జరిగే ఈ కాంపిటిషన్‌లో వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి 24 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు.

శిథిలావస్థకు బస్ షెల్టర్



మరమ్మతులు చేయాల్సిన బస్ షెల్టర్ ఇదే..

పరవాడ: ప్రయాణికుల సౌకర్యార్థంతిక్కవానిపాలెంలో నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. 15 ఏళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం లక్షలాది రూపాయల వ్యయంతో బస్ షెల్టర్ నిర్మించింది. ప్రయాణికులకు అనేక విధాలుగా ఉపయోగపడేది. రాను రాను బస్ షెల్టరు మరమ్మతులకు గురైంది. శ్లాబు బీటలువారి ఏ మాత్రం వర్షం పడినా కారిపోతోంది. గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. షెల్టర్‌కు మరమ్మతులు నిర్వహించాలని గ్రామ పంచాయతీ, సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్‌కు రిపేర్లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓజోన్ పొర రక్షణ.. అందరి బాధ్యత



గొడుగులు పట్టుకుని ర్యాలీ చేస్తున్న డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ: ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి లెంక చంద్రకళ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాంకేతిక మండలి విశాఖపట్నం, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలసి ఓజోన్‌పై అవగాహన కోసం గొడుగులు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఓజోన్ పొరను కాపాడుకోవాలి.. అందరూ బాధ్యతతో మెలగాలి అంటూ నినాదాలు చేశారు. పాఠశాల నుంచి తోటగరువు వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. జీవావరణానికి ఓజోన్ పొర రక్షణ కవచంగా ఉందన్నారు. ఓజోన్ దెబ్బతినడం వల్ల వాతావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూవాతావరణంలో ప్రవేశించి, భూమి ఓడెక్కడంతో పాటు అనేక రకాల వ్యాధులు వస్తాయన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటే సకల జీవరాశుల మనుగడ ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దీన్ని రక్షించుకోడానికి అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏపీకాస్ట్ జిల్లా సమన్వయాధికారి పి.రాజారావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం టి.రామకృష్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు చంద్రాజీ, స్వామినాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ జాన్ ప్రసాద్, సభ్యులు అనురాధ, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు పసుపు కుంకుమలు అందిస్తున్న సీడీపీవో లలితకుమారి

పరవాడ: గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారపదార్థాలను తినడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తుందని సబ్బవరం సీడీపీవో లలితకుమారి అన్నారు. వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మహా కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ గర్భవతులు తీసుకునే ఆహారంపై జాగ్రత్తలను సూచించారు. ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కె.శ్రీను, ఎంపీటీసీ బి.అప్పలరాజు, సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవిస్తే ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, యూపీహెచ్‌సీలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ప్రతి గర్భిణిని సంబంధిత యూపీహెచ్‌సీలో చూపించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, అగనంపూడి ఏరియా ఆస్పత్రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాధురి, డాక్టర్ వర్ణిక, డాక్టర్ ఎస్.సి.బి.నాయుడు, జిల్లా మీడియా విస్తరణాధికారి ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ రేవతి, డాక్టర్ జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేవీలో హిందీ పక్షోత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

సింధియా: తూర్పు నావికాదళంలో హిందీ పక్షోత్సవాలను తూర్పు నావికాదళ హెడ్ క్వార్టర్స్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా హిందీ వర్క్‌షాప్ తోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, అక్టోబర్ 10న అంతర్గత హిందీ మ్యాగజైన్ పూర్వవాణి 30వ ఎడిషన్ విడుదల చేస్తామని తెలిపారు. తూర్పు నావికాదళానికి చెందిన సర్వీస్ సిబ్బంది, పౌర సిబ్బందికి పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి, అభినందించారు. హిందీ ప్రాముఖ్యతను పెంచేందుకు సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని ప్రిన్సిపాల్ రమణ సూచించారు. ఇక్కడ డిప్లమో అసిస్టెంట్ కేటరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిఫెన్స్ ఉద్యోగులు ఆరు నెలల పాటు పొందిన శిక్షణ పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ వృత్తిపరమైన అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్వయం ఉపాధి పొందగోరు వారు కూడా ఈ కోర్సులో చేరడం ద్వారా అవకాశాలను మరింత మెరుగుపరచుకోవచ్చన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్, ఎఫ్‌సీఐ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశేషంగా లక్ష్మీగణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న సింహపురి కాలనీ వాసులు

సింహాచలం: 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ ఆధ్వర్యంలో వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సామూహిక లక్ష్మీ గణపతి హోమాన్ని విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి స్తోత్రాలను పఠింపజేశారు. భక్తులకు హోమ ప్రసాదాన్ని అందించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



అన్నసమారాధనను ప్రారంభించిన గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక జగన్నాథం వీధిలో వరసిద్ధి వినాయక అనుపమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గణనాథుడిని గ్రామ పెద్దలు, భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, నాయకులు పైల హరీష్, పైల అప్పలనాయుడు, సత్యవేణి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

70 మందికి ఉచిత దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెందుర్తి: నాయుడుతోట సమీపంలోని వెంకటసాయినగర్ సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్, గీతం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. గీతం వైద్య సిబ్బంది 70 మందికి దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు మనోజ్, గణేష్, మౌనిక, చాందిని, దీపక్, ప్రవీణ్, సుప్రియ, గీతం ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2 పరిధి, గుల్లేపల్లి ఫీడర్ల పరిధి 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, అయ్యన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఏయూ ఉద్యోగుల హాజరు తనిఖీ



హాజరు తనిఖీ చేస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలను గురువారం కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరు, తరగతుల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. తనిఖీల్లో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంద రోజులూ కూటమి కుట్రలే..

- ఈ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలేంటో చెప్పాలి
- ఎన్నికల్లో ఖర్చుపెట్టింది రాబట్టుకునేందుకే ఆరాటం
- టీడీపీ కార్పొరేటర్ భర్త చేస్తున్న భూ కబ్జాలను అడ్డుకోరా?
- కళ్లు మూసుకున్న రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత అదీప్‌రాజ్



మాట్లాడుతున్న అదీప్‌రాజ్, చిత్రంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, మెంటి మహేష్

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో కుట్రలు, కక్షపూరిత చర్యలు తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏంటో ప్రజలకు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రశ్నించారు. రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బును వెనక్కి రాబట్టుకునేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కుమ్మక్కై భూ కబ్జాలు, దందాలు చేస్తున్నారని తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు టీడీపీ కార్పొరేటర్ శానాపతి వసంత భర్త శంకర్రావు చేస్తున్న భూ కబ్జాయే దీనికి నిదర్శనమన్నారు. సర్వే నెం.113లో రూ.కోట్లు విలువ చేసే భూమిని దర్జాగా శంకర్రావు కబ్జా చేస్తున్నా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. నీతివంతమైన, పారదర్శక పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు తమ మిత్రపక్షం నాయకులు చేస్తున్న ఈ భూకబ్జా కనిపించట్లేదా.. అని ప్రశ్నించారు. దీనిపై తక్షణమే ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ భూమి కబ్జాకు గురి కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే ఈ భూమిలో నిర్మాణం ప్రారంభం కావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీని వెనుక ఎమ్మెల్యే హస్తంపై ప్రజల్లో అనుమానం ఉందన్నారు. పెందుర్తి ప్రాంతంలో ప్రభుత్వ భూములకు ఇంటి పన్నులు, విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. వంద రోజుల్లోనే కూటమి నాయకులు నియోజకవర్గంలో కబ్జాలు, దోపిడీలకు ఈ స్థాయిలో పాల్పడితే రాబోయే రోజుల్లో మరెన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందోనని ప్రజలు హడలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్మార్గాలకు, దోపిడీలకు అడ్డుకట్ట వేయకపోతే రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రజల నుంచి ప్రతఘటన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మెంటి మహేష్ పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి అదీప్‌రాజ్ పరామర్శ



నాగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

పరవాడ: కన్నూరు ఎంపీటీసీసభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు తండ్రి నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన అనుచరులతో కన్నూరు చేరుకుని నాగరాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాగరాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, నాయకులు గొర్లి గోపి, బంధం నాగేశ్వరరావు, కోన రామారావు, కొటాన రాము, వెన్నల సన్యాసిరావు, రమణ, సూరిబాబు తదితరులు ఉన్నారు.

ప్రజలకు మరింత మంచి చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ప్రజలకు చాలా మంచి చేశామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. రానున్న రోజుల్లో మరింత మేలు చేస్తామన్నారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లు పెంచామన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. 'ఇది మంచి ప్రభుత్వం'పేరిట నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు గ్రామాలు/వార్డుల్లో తాము చేసిన మంచిని వివరిస్తామని తెలిపారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

సబ్బవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 21న బాలురకు, 23న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పెందుర్తి నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల పట్ల ఆసక్తిగల విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వాల్తేరు డిపో యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ వాల్తేరు డిపో మేనేజర్, యాజమాన్యం తీరు, ఉద్యోగుల సమస్యలపై ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డిపో యాజమాన్యం తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఉద్యోగులు కొంతకాలంగా డిపో ఎదుట దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు తెలిపారు. వాల్తేరు డిపో కండెక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ డిపో మేనేజర్ వైఖరికి వ్యతిరేకంగా దాదాపు 40 రోజుల నుంచి ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా.. యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. విశాఖ డీపీటీవో కక్షపూరితంగా వ్యవహరిస్తూ కండక్టర్లు, డ్రైవర్లను అక్రమ సస్పెన్షన్లు చేసేలా ఆదేశాలిస్తూ ప్రతి డిపోలో సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డిపో యాజమాన్య వైఖరిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కండక్టర్‌పై డీఎం సెస్పెన్షన్‌ను ఎత్తివేసి వాల్తేర్ డిపో పరిధిలోనే ఆయనకు తిరిగి ఉద్యోగ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను ఎన్ఎంయూఏ ప్రతినిధులు కోరారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు గండి రామకృష్ణ, కార్యదర్శి బి.నీలకంఠం పాల్గొన్నారు.

ఏయూ విభాగాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పరిధిలోని పలు విభాగాలను గురువారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సందర్శించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావుతో కలిసి సోషల్ సైన్సెస్ భవనంలోని సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం విభాగాల్లో తనిఖీలు చేశారు. తరగతులు జరుగుతున్న విధానం, హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులతో ముచ్చటించారు. ఏయూ గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. విదేశీ విద్యార్థులు సైతం ఈ విభాగాల్లో విద్యను అభ్యసిస్తుండటాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వీసీ వెంట అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, సిబ్బంది ఉన్నారు.